లగచర్ల రైతులపై ప్రభుత్వ వేధింపులను ఖండిస్తూ

## నేడు బీఆర్ఎస్ నిరసనలు

అన్ని నియోజవర్గ కేంద్రాల్లో అంబేద్కర్ విగ్రహాలకు వినతులు

- విజయవంతం చేయాలని బీఆర్ఎస్ సూర్యాపేట జిల్లా అధ్యక్షుడు బడుగుల పిలుపు
- మిర్యాలగూడలో భారీ ర్యాలీకి మాజీ ఎమ్మెల్యే భాస్కర్‌రావు ఏర్పాట్లు

సూర్యాపేట, (నమస్తే తెలంగాణ)/మిర్యాలగూడ, డిసెంబర్ 16 : ఫార్మాసిటీకి భూములు ఇవ్వనందుకు లగచర్ల రైతులను వేధింపులకు గురి చేసి జైలుపాలు చేసిన కాంగ్రెస్ ప్రభుత్వం మనసు మారాలంటూ మంగళవారం నల్లగొండ, సూర్యాపేట జిల్లాలో అన్ని నియోజకవర్గ కేంద్రాల్లో బీఆర్ఎస్ ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమాలు చేపట్టనున్నారు. లగచర్ల రైతులపై పెట్టిన కేసులను ఎత్తి వేయాలని కోరుతూ ర్యాలీలు నిర్వహించి డాక్టర్ బీఆర్ అంబేద్కర్ విగ్రహాలకు వినతిపత్రాలు అందించనున్నారు. ఈ కార్యక్రమాలకు పెద్ద ఎత్తున పాల్గొని విజయవంతం చేయాలని బీఆర్ఎస్ సూర్యాపేట జిల్లా అధ్యక్షుడు బడుగుల లింగయ్యయాదవ్ ఒక ప్రకటనలో ఆ పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. మిర్యాలగూడ పట్టణంలోని పార్టీ కార్యాలయం నుంచి సాగర్ రోడ్డులోని అంబేద్కర్ విగ్రహం వరకు ర్యాలీ నిర్వహించనున్నట్లు మాజీ ఎమ్మెల్యే నల్లమోతు భాస్కర్‌రావు తెలిపారు.



మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ ఆశీర్వాదం తీసుకుంటున్న మాజీ ఎమ్మెల్యే గాదరి కిశోర్‌కుమార్, కుటుంబ సభ్యులు

# పైసాలేని పల్లెలు

## గ్రామ పంచాయతీ ఖజానా ఖాళీ

### ఆర్థిక భారాలన్నీ కార్యదర్శులపైనే..




- ఉద్యోగ భయంతో ఇప్పటికే రూ.లక్షల్లో తెచ్చిన పెట్టిన వైనం
- ఏడాదిగా నిధులు విదల్చని కాంగ్రెస్ సర్కారు
- సమస్యల కూపాలుగా మారుతున్నగ్రామాలు
- బీఆర్ఎస్ హయాంలో జిల్లాకు నెలనెలా రూ.12 నుంచి 16 కోట్లు

గ్రామీణ ప్రాంతాలను సమస్యలు ఉక్కిరి బిక్కిరి చేస్తున్నాయి. పల్లెల నిర్వహణకు ఏడాది కాలంగా కాంగ్రెస్ ప్రభుత్వం నయాపైసా విదిల్చకపోవడంతో గ్రామ పంచాయతీలు ఆర్థిక అవస్థలతో సతమతం అవుతున్నాయి. పాలక వర్గాల పదవీ కాలం పూర్తయిన అనంతరం ప్రత్యేక అధికారులను నియమించినప్పటికీ నిధులు లేకపోవడంతో ఎక్కడి సమస్యలు అక్కడే ఉంటున్నాయి. ఉన్నతాధికారుల ఆదేశాలతో ఉద్యోగాలు పోగుట్టుకోలేక విధి లేక కార్యదర్శులే అప్పులు చేసి మౌలిక సదుపాయలు కల్పిస్తున్నారు. బీఆర్ఎస్ పాలనలో పల్లె ప్రగతి పేరిట నెల నెలా గ్రామపంచాయతీలకు నిధులు అందేవి. సూర్యాపేట జిల్లాకు ప్రతి నెలా రూ.12 కోట్ల నుంచి 16 కోట్లు వరకూ మంజూరయ్యేవి. క్రమం తప్పకుండా నిధులు ఇవ్వడం వల్లే దశాబ్దాల తరబడి వెనుకబడిన పల్లెలు సైతం దీర్ఘకాలిక సమస్యలను పరిష్కరించుకుని కొత్త సొలత్‌లను సమకూర్చుకున్నాయి. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి రావడంతో పరిస్థితి మళ్లీ మొదటికి వచ్చింది.

– సూర్యాపేట, డిసెంబర్ 16 (నమస్తే తెలంగాణ)

పల్లెలే ప్రగతికి సోపానాలు.. అవి బాగుపడితేనే దేశం బాగుపడుతుందని నమ్మి తెలంగాణ తొలి ముఖ్యమంత్రి కేసీఆర్ తన తొమ్మిదిన్నరేండ్ల పాలనలో గ్రామీణ ప్రాంతాల సమగ్రాభివృద్ధికి పాటుపడ్డారు. కేంద్రం నుంచి గ్రామాలకు నిధులు వచ్చినా రాకున్నా దేశంలోనే ఎక్కడా లేనివిధంగా నెలనెలా కోట్లాది రూపాయలు వెచ్చించారు. వాటితోనే గ్రామాల్లో మౌలిక వసతులు కల్పించడంతోపాటు అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టారు. పల్లె ప్రగతిలో భాగంగా ప్రతి గ్రామానికి అందించిన ట్రాక్టర్లు, ట్యాంకర్లు నిర్వహణ లేక మూలన పడ్డాయి. గతంలో

**ట్రాక్టర్ డీజిల్‌కూ కష్టమే..**

నిత్యం చెత్తను ఎత్తిన ట్రాక్టర్లు, మొక్కలకు నీళ్లు పోసిన టాంకర్ల డీజిల్‌కు కూడా డబ్బులు ఉండడం లేదని పంచాయతీ కార్యదర్శులు వాపోతున్నారు. మరోవైపు రిపర్ వచ్చిన ట్రాక్టర్లకు మరమ్మత్తులు చేయించకపోవడంతో నిరుపయోగంగా మారుతున్నాయి. మెజారిటీ గ్రామాల్లో ట్రాక్టర్లకు ఈఎంఐ చెల్లించకపోవడంతో నోటీసుల మీద నోటీసులు వస్తుండగా అధికారులు రేపు, మాపు అంటూ కాలం సర్దిచెప్పుకొస్తున్నారు. మరోవైపు నిధులు రాకపోవడంతో బ్లీచింగ్ పౌడర్, విద్యుత్ బిల్లులు, తాగునీటి సరఫరా మోటార్ల మరమ్మతులు, వీధిదీపాలకు కూడా కష్టమవుతున్నది.


అర్వపల్లి మండలం కోమటిపల్లిలో నిరుపయోగంగా మారిన గ్రామ పంచాయతీ ట్రాక్టర్

**ఉద్యోగ భయంతో అప్పల పాలు**

సర్పంచ్‌ల పదవీ కాలం పూర్తయిన తరువాత పల్లెల్లో నెలకొన్న సమస్యలను పరిష్కరించాల్సిన బాధ్యత పంచాయతీ కార్యదర్శులపై పడింది. గ్రామాల్లో తరచూ తాగునీటి బోర్లు కాలిపోవడం, పైపు లైన్ మరమ్మతులు, గేట్‌వాల్స్ మార్పు, పారిశుధ్య నిర్వహణకు డబ్బులు అవసరం అవుతున్నాయి. ప్రత్యేక అధికారులను నియమించి చేతులు దులుపుకొన్న ప్రభుత్వం నిధులు మాత్రం ఇవ్వకపోవడంతో సెక్రటరీలు తమ వేతనాలతో పాటు అప్పులు చేసి మరీ వెచ్చిస్తున్నారు. ఇలా జిల్లాలోని చిన్న పంచాయితీలో రూ.2 లక్షల నుంచి 3 లక్షలు, పెద్ద గ్రామపంచాయతీల్లో 4లక్షల నుంచి 5 లక్షల వరకు కార్యదర్శులు ఖర్చు చేసి బిల్లుల కోసం ఎదురు చూస్తున్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి పంచాయతీలకు నిధులు విడుదల చేయాలని గ్రామీణ ప్రజానీకం కోరుతున్నారు.

## గాదరి కిశోర్‌కు మాజీ సీఎం కేసీఆర్ శుభాకాంక్షలు

తిరుమలగిరి, డిసెంబర్ 16 : తుంగతుర్తి మాజీ ఎమ్మెల్యే గాదరి కిశోర్‌కుమార్ తన పుట్టిన రోజు సందర్భంగా సోమవారం మాజీ ముఖ్యమంత్రి, బీఆర్ఎస్ అధినేత కేసీఆర్‌ను కుటుంబ సమేతంగా కలిశారు. ఆయన నుంచి ఆశీర్వాదం తీసుకున్నారు. మాజీ మంత్రి, బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌ను కూడా కిశోర్ కలిశారు. కేసీఆర్, కేటీఆర్ కిశోర్‌కు పుట్టిన రోజు శుభాకాంక్షలు తెలిపి, ఇలాంటి జన్మదిన వేడుకలు మరెన్నో జరుపుకోవాలని ఆకాంక్షించారు.


నల్లగొండ జిల్లా కేంద్ర దవాఖానలో డాక్టర్లు, సిబ్బందితో మాట్లాడుతున్న కలెక్టర్ ఇలా త్రిపాఠి

## ప్రభుత్వ ఆస్పత్రిలో అన్ని వైద్య సౌకర్యాలు కల్పించాలి

- కలెక్టర్ ఇలా త్రిపాఠి

నల్లగొండ, డిసెంబర్ 16 : జిల్లా కేంద్ర దవాఖానలో ఏర్పాటు చేయనున్న క్యాన్సర్, మధుమేహ, గుండె నియంత్రణ కేంద్రాలకు అన్ని సౌకర్యాలు కల్పించాలని కలెక్టర్ ఇలా త్రిపాఠి సూచించారు. జిల్లా కేంద్ర ఆస్పత్రిని సోమవారం ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఈ కేంద్రంలో ఫిజీషియన్‌తోపాటు ఆంకాలజిస్టు, గుండె వైద్య నిపుణులను అందుబాటులో ఉంచనున్నట్లు, ఇందుకోసం అన్ని మౌలిక వసతులు కల్పించాలని తెలిపారు. ఇందుకు అవసరమైన నిధులు అందజేస్తామని చెప్పారు. ఐసీయూ, ఎమర్జెన్సీ వార్డుల్లో 24గంటలు సేవలు అందించే విధంగా చూడాలని డాక్టర్లు, సిబ్బందిని ఆదేశించారు. ఆస్పత్రికి వస్తున్న ఔట్ పేషెంట్ల వివరాలు, ఐసీయూ, ఎస్ఎన్‌సీయూ ద్వారా అందిస్తున్న సేవలను అడిగి తెలుసుకున్నారు. డయాగ్నస్టిక్, ల్యాబ్ పరీక్షలను పరిశీలించారు. ఆమె వెంట సూపరింటెండెంట్ అరుణకుమారి, డీఎంహెచ్ఓ పుట్ల శ్రీనివాస్, డిప్యూటీ డీఎంహెచ్ఓ వేణుగోపాల్ రెడ్డి తదితరులు ఉన్నారు.



## మస్త్ ఇగం

- జిల్లాను వణికిస్తున్న చలి
- మునుగోడు నియోజకవర్గంలో 10.7డిగ్రీలు

నల్లగొండ, డిసెంబర్ 16 : రాత్రి, పగలు తేడా లేకుండా జిల్లాను చలిగాలులు వణికిస్తున్నాయి. గాలిలో తేమ శాతం పెరగడంతో పాటు బంగాళాఖాతంలో ఉపరితల ఆవర్తన పీడనం ఏర్పడడం వల్ల మూడు రోజుల నుంచి ఉష్ణోగ్రతలు పడిపోతున్నాయి. దాంతో జనం ఇబ్బంది పడుతున్నారు. మునుగోడు, దేవరకొండ నియోజకవర్గాల్లో చలి ప్రభావం తీవ్రంగా ఉన్నట్లు వాతావరణ శాఖ రికార్డులు చెప్తున్నాయి. కనిష్ఠ ఉష్ణోగ్రతలు 10 నుంచి 15 డిగ్రీల వరకు నమోదు అవుతుండగా... గరిష్ఠ ఉష్ణోగ్రతలు 28 డిగ్రీల నుంచి 31 డిగ్రీల వరకు ఉంటున్నా యి. ఆదివారం మునుగోడు నియోజక వర్గంలోని చండూరులో 10.7, మునుగోడులో 10.9 డిగ్రీల కనిష్ట ఉష్ణోగ్రత రికార్డ్ అయ్యింది. జిల్లా వ్యాప్తంగానూ పగలు కూ డా జనం స్వెటర్లతో కనిపిస్తున్నారు. ఉదయం బాగా పొద్దెక్కే వరకు, సాయంత్రం తర్వాత తప్పని సరి అయితే తప్ప బయటకు రావడం లేదు.

## ముగిసిన గ్రూప్-2 పరీక్షలు

- రెండో రోజూ సగం మందే హాజరు
- నల్లగొండ జిల్లాలో 49.10 శాతం.. సూర్యాపేటలో 50.24 శాతం


నల్లగొండ ఎన్‌జీ కాలేజ్ సెంటర్ వద్ద తనిఖీ చేస్తున్న సిబ్బంది

రామగిరి/సూర్యాపేట, డిసెంబర్ 16 : తెలంగాణ రాష్ట్ర పబ్లిక్ సర్వీస్ కమిషన్ నిర్వహించిన గ్రూప్-2 పరీక్షలు ముగిశాయి. రెండో రోజు సోమవారం పరీక్షలు సజావుగా జరిగాయి. నల్లగొండ జిల్లాలో 49.10శాతం, సూర్యాపేట జిల్లాలో 50.24 శాతం మంది అభ్యర్థులు పరీక్షలు రాశారు. నల్లగొండ జిల్లా కేంద్రంలో పేపర్-3 పరీక్షకు 21,177 మందికిగానూ 11,284 మంది హాజరు కాగా 9,893మంది గైర్హా జరయ్యారు. పేపర్ -4 పరీక్షకు 11,291మంది హాజరుకాగా 9886 మంది గైర్హాజరయ్యారు. మిర్యాలగూడలో పేపర్-3కి 7,941 మందికిగానూ 3,013మంది హాజరు కాగా 4,928మంది గైర్హాజరయ్యారు. పేపర్-4కు 3,010 మంది హాజరుకాగా 4,931మంది గైర్హాజరయ్యారు. సూర్యాపేట జిల్లాలో 16,857 మందికిగానూ పేపర్-3కి 8,479 మంది హాజరుకాగా 8,378 మంది గైర్హాజరయ్యారు. పేపర్-4కు 8,470 మంది హాజరవగా 8,387 మంది గైర్హాజరయ్యారు. రెండు రోజుల పాటు ఎలాంటి సంఘటన జరుగకుండా పరీక్షలు సజావుగా జరిగాయి. సూర్యాపేటలో కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్ పవార్ పరీక్ష కేంద్రాలను పరిశీలించారు. నల్లగొండలో పరీక్ష కేంద్రాలను రీజినల్ కోఆర్డినేటర్ సముద్రాల ఉపేందర్, బి.నాగరాజు, టీజీపీఎస్సీ ప్రత్యేక పరిశీలకులు శ్రీధర్, యాదగిరి, శివారెడ్డితోపాటు జిల్లా అధికారులు పరిశీలించారు.

## సుప్రీం కోర్టు ఆదేశాల మేరకు ఎస్సీ వర్గీకరణ చేపట్టాలి

### కమిషన్ పేరుతో కాంగ్రెస్ సర్కారు కాలయాపన

- సీఎం రేవంత్‌రెడ్డి రెండు నాలుకల ధోరణి సరికాదు
- మాజీ ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య



కట్టంగూర్, డిసెంబర్ 16 : సుప్రీం కోర్టు ఆదేశాల మేరకు రాష్ట్ర ప్రభుత్వం ఎస్సీ వర్గీకరణ చేపట్టాలని మాజీ ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య అన్నారు. కట్టంగూర్‌లో సోమవారం ఆయన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఎస్సీ వర్గీకరణ కోసం మాదిగలు 30 సంవత్సరాల పాటు సుదీర్ఘపోరాటం చేశారని, ఎంతో మంది తమ జీవితాలను త్యాగం చేశారని తెలిపారు. రాజ్యాంగం ద్వారా అందాల్సిన ఫలాలు సక్రమంగా అందడం లేదని చేస్తున్న పోరాటం ప్రపంచ చరిత్రలో ఇంతపెద్ద ఉద్యమం ఎప్పుడూ జరుగలేదన్నారు. కులగణన ఆధారంగా మాదిగలకు వాటా ఇవ్వాలని డిమాండ్ చేశారు. మాజీ సీఎం కేసీఆర్ హయాంలో దళిత ఎమ్మెల్యేలు, ఎంపీలతో పాటు దళిత సంఘాల నాయకులను వర్గీకరణ కోసం ఢిల్లీకి తీసుకెళ్లారని గుర్తు చేశారు. వర్గీకరణ కోసం బీఆర్ఎస్ ఎంపీలు పార్లమెంట్‌లో తమ గొంతు వినిపించారని తెలిపారు. మాల, మాదిగలు ఒకరిని మరొకరు నిందించుకునే విధంగా ఉండొద్దని, అందరూ కలిసి ఉండాలని మాజీ సీఎం కేసీఆర్ కోరుకుంటున్నారని చెప్పారు. సుప్రీం కోర్టు ఆదేశాల మేరకు వర్గీకరణ చేస్తామని సీఎం రేవంత్‌రెడ్డి చెప్పినా కాంగ్రెస్ నాయకులు మాత్రం కమిటీలు, ప్రకటనలతో కాలయాపన చేస్తున్నారని తెలిపారు. ప్రభుత్వం మాలలను రెచ్చగొట్టే ప్రయ త్నం చేస్తున్నదని ఆరోపించారు. ఆర్టికల్ 14 ప్రకా రం ఆయా రాష్టాలు ఎస్సీ వర్గీకరణ చేసుకోవచ్చని సుప్రీం కోర్టు తీర్పు ఇచ్చిన సందర్భంగా అన్ని రా ష్ట్రాలకంటే ముందే తెలంగాణలో వర్గీకరణ చేసిన తరువాతే ఉద్యోగాలు ఇస్తామని చెప్పిన రేవంత్‌రెడ్డి పాత రిజర్వేషన్ ప్రకారమే ఉద్యోగాలు భర్తీ చేస్తున్నారని విమర్శించారు. కమిషన్ పేరుతో కాంగ్రెస్ ప్రభుత్వం కాలయాపన చేస్తున్నదని స్పష్టంగా అర్థమవుతుందన్నారు. వర్గీకరణ విషయంలో సీఎం రేవంత్‌రెడ్డి రెండు నాలుకల ధోరణితో మాలలను రెచ్చగొట్టే విధంగా మాట్లాడుతున్నారని మండిపడ్డారు. జరుగబోయే అసెంబ్లీ సమావేశాల్లో ఎస్సీ వర్గీకరణ విషయమై తీర్మానం చేయాలని డిమాండ్ చేశారు.

## యాసంగికి సాగర్ నీటి విడుదల

- షెడ్యూల్ ప్రకటించిన అధికారులు

నందికొండ, డిసెంబర్ 12 : నాగార్జునసాగర్ డ్యామ్ ఎడమ కాల్వ కింద సాగు చేసే భూములకు ఈ నెల 15నుంచి ఆన్ అండ్ ఆఫ్ పద్ధతిలో నీటి విడుదలను కొనసాగిస్తున్నట్లు ఎన్ఎస్‌పీ అధికారులు తెలిపారు. యాసంగి సాగుకు నీటి విడుదల షెడ్యూల్‌ను హిల్‌కాలనీ ఇరిగేషన్ అధికారులు సోమవారం ప్రకటించారు. యాసంగిలో ఆరుతడి పంటలు వేసుకోవాలని, నీటిని పొదుపుగా వినియోగించుకోవాలని, ఆయకట్టు చివరి భూములకు నీరు అందే విధంగా రైతులు సహకరించాలని కోరారు.

**నీటి విడుదల షెడ్యూల్**

- మొదటి విడుత –డిసెంబర్ 15 నుంచి జనవరి 11 వరకు
- రెండో విడుత –జనవరి 19 నుంచి జనవరి 28 వరకు
- మూడో విడుత –ఫిబ్రవరి 5 నుంచి ఫిబ్రవరి 14 వరకు
- నాలుగో విడుత – ఫిబ్రవరి 22 నుంచి మార్చి 25 వరకు
- ఐదో విడుత – మార్చి 11 నుంచి మార్చి 20 వరకు
- ఆరో విడుత – మార్చి 28 నుంచి ఏప్రిల్ 25 వరకు
- ఏడో విడుత –ఏప్రిల్ 25 నుంచి ఏప్రిల్ 23 వరకు

## మాజీ సర్పంచుల చలో అసెంబ్లీ భగ్నం


కనగల్ పోలీస్ స్టేషన్‌లో నిరసన తెలుపుతున్న అరెస్టయిన మాజీ సర్పంచ్‌లు

- అడుగడుగునా అడ్డుకొని అరెస్ట్ చేసిన పోలీసులు
- ఏడాదైనా పెండింగ్ బిల్లులు ఇవ్వట్లేదని మాజీ సర్పంచుల ఆవేదన
- ఉమ్మడి నల్లగొండ జిల్లాలో సుమారు రూ.100 కోట్ల బకాయిలు

నల్లగొండ, డిసెంబర్ 16 : కాంగ్రెస్ ప్రభుత్వం రాష్ట్రంలో అధికారంలోకి వచ్చి ఏడాది పూర్తయిన సందర్భంగా ప్రజాపాలన పేరుతో సంబురాలు చేసుకుంటుందే తప్ప అప్పులు తెచ్చి గ్రామాలను అభివృద్ధి చేసిన తమకు మాత్రం బిల్లులు ఇవ్వడం లేదని ఆవేదన వ్యక్తం చేస్తూ సోమవారం మాజీ సర్పంచులు చలో అసెంబ్లీ కార్యక్రమాన్ని నిర్వహించారు. దాంతో పోలీసులు ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా వారిని వెళ్లనివ్వకుండా ఎక్కడికక్కడ అడ్డుకొని పోలీస్‌స్టేషన్లకు తరలించారు. ఉమ్మడి నల్లగొండ జిల్లాలో 1740గ్రామ పంచాయతీలు ఉండగా గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో పల్లెల్లో అభివృద్ధి పనుల కోసం నిధులు ఖర్చు చేశారు. సీసీ రోడ్ల నిర్మాణంతో పాటు ఇతర పనులకు సుమారు రూ.100కోట్ల మేరకు అప్పులు తెచ్చి పెట్టుబడి పెట్టినట్లు సర్పంచుల ఆవేదన. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన తొలుత బడా కాంట్రాక్టర్లకు బిల్లులు ఇచ్చి, తమకు ఏడాదిగా ఇవ్వడం లేదని, దాంతో తెచ్చిన అప్పులకు వడ్డీలు కట్టలేక ఇబ్బందులు పడుతున్నామని ప్రభుత్వాన్ని పలుమార్లు మాజీ సర్పంచులు వేడుకున్నారు. అయినా సర్కార్ స్పందించకపోవడంతో చలో అసెంబ్లీకి పిలుపునివ్వగా అక్కడికి వెళ్లకుండా పోలీసులు అరెస్ట్ చేశారు. అనంతరం సొంత పూచీకత్తుతో విడుదల చేశారు.



నల్లగొండలో డీఈఓ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహిస్తున్న మధ్యాహ్న భోజన కార్మికులు

## మధ్యాహ్న భోజన కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

- డీఈఓ కార్యాలయం ఎదుట ధర్నా

రామగిరి, డిసెంబర్ 16 : పాఠశాలల్లో మధ్యాహ్న భోజనం వండే కార్మికులు తమ సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ సోమవారం జిల్లా విద్యాశాఖాధికారి కార్యాలయం ఎదుట ధర్నా చేశారు. ఈ సందర్భంగా ఆ సంఘం నాయకులు మాట్లాడుతూ సమస్య పరిష్కారానికి ఈ నెల 17న కలెక్టరేట్ ఎదుట జరిగే ధర్నాకు అధిక సంఖ్యలో వచ్చి విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. అనంతరం డీఈఓ కార్యాలయ సూపరింటెండెంట్ పవన్‌కుమార్‌కు వినతి పత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు, సీపీఎం జిల్లా కార్యదర్శి తుమ్మల వీరారెడ్డితోపాటు తెలంగాణ మధ్యాహ్న భోజన కార్మికుల సంఘం సీఐటీయూ నాయకులు పోలె సత్యనారాయణ, అద్దంకి నరసింహ, చింత సంగీత, దమయంతి తదితరులు పాల్గొన్నారు.

## వివాద్ సే విశ్వాస్ స్కీమ్‌పై అవగాహన



అవగాహన కార్యక్రమంలో మాట్లాడుతున్న ఆదాయపు పన్నుశాఖ ప్రధాన కమిషనర్ ముకాంబికేయన్

నల్లగొండ, డిసెంబర్ 16: ఆదాయపు పన్నుకు సంబంధించి వివాద్ సే విశ్వాస్ స్కీమ్‌పై సోమవారం కలెక్టరేట్‌లోని ఉదయాదిత్య భవన్‌లో ఆదాయపు పన్ను శాఖ అధికారులు పన్ను చెల్లింపు దారులకు, ఆడిటర్లకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆదాయపు పన్నుశాఖ ప్రధాన కమిషనర్ ముకాంబికేయన్ ఈ స్కీమ్‌పై పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా అవగాహన కల్పించారు. వారి సందేహాలను నివృత్తి చేశారు. ఈ స్కీమ్ ఈ ఏడాది అక్టోబర్‌లో అమల్లోకి వచ్చినట్లు తెలిపారు. కార్యక్రమంలో హైదరాబాద్ సర్కిల్ డిప్యూటీ కమిషనర్ రవికిరణ్, లింగబత్తుల మోహన్, ఆకాశ్, రమణ పాల్గొన్నారు.

## మోడల్ స్కూల్ ఉపాధ్యాయుల నిరసన

త్రిపురారం, డిసెంబర్ 16: అపరిష్కృతంగా ఉన్న తమ సమస్యలను పరిష్కరించాలని కోరుతూ సోమవారం మండలంలోని కంపసాగర్ మోడల్ స్కూల్‌లో ఉపాధ్యాయులు భోజన విరామ సమయంలో నల్లబ్యాడ్జీలు ధరించి నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భగా పలువురు ఉపాధ్యాయులు మాట్లాడుతూ 010 పద్దు ద్వారా వేతనాలు అందించాలని, నోషనల్ సర్వీస్, పీజీటీలకు జేఎల్ అప్‌గ్రేడేషన్, హెల్త్‌కార్డులు మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ మంచి కంటి వెంకటేశ్వర్లు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.


కంపసాగర్ మోడల్ స్కూల్‌లో నల్లబ్యాడ్జీలు ధరించి నిరసన తెలుపుతున్న ఉపాధ్యాయులు